

-సునీల్ ధవళ
స్టాక్ మార్కెట్ నిపుణులు
ఫార్మర్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్,
అనిల్ ధీరుబాయి
అంబానీ రిలయన్స్ గ్రూప్

# షేర్ కార్నర్

## స్టాక్ మార్కెట్ ప్రశ్నలు - జవాబులు

**మ్యూచువల్ ఫండ్‌ల గురించి చాలా వింటున్నాము. వాటి పై బొత్తిగా పరిజ్ఞానం లేని పాఠకుల కోసం మ్యూచువల్ ఫండ్ గూర్చి సరళమైన భాషలో వివరంగా తెలియచెప్పగలరు?**

**వి. ఎన్. భూషణం, కాకినాడ**

ఒకే వరుసలో ఇల్లున్న ఓ నలుగురు ఇంటి యజమానులు కలసి తమస్థలాన్ని ఒకబిల్డరుకిచ్చి అపార్ట్మెంట్ కట్టి తమకు ఫ్లాట్స్ ఇమ్మని అంగీకారం కుదుర్చుకొంటారు. తమ ఒక్క జాగాలో ఇల్లు పడగొట్టి ఫ్లాట్ కట్టాలంటే డబ్బు చాలదు. పైగా అంత సమయం, ఫ్లాట్ కట్టే అనుభవం, నేర్పరితనం కూడా వారికి ఉండదు కాబట్టి బిల్డర్ మీద ఆధారపడతారు. ఈ ఉదాహరణ లాగే, మ్యూచువల్ ఫండ్లు ఒక సమిష్టి పెట్టుబడి సాధనం అందరికీ షేర్ మార్కెట్ మీద అవగాహన ఉండదు, కొన్న షేర్లను రోజూ పర్యవేక్షణ చేయడానికి సమయం ఉండదు, మంచి కంపెనీల షేర్లు కొనడానికి తగినంత డబ్బు ఉండదు. అలాంటి మదుపరులకు కూడా షేర్ మార్కెట్ లో పాల్గొనడానికి అవకాశం కలిపించేవే మ్యూచువల్ ఫండ్లు. మ్యూచువల్ ఫండ్లు బిల్డర్ లాంటివి. వందల మంది నుంచి సేకరించిన సొమ్ముని షేర్లు, బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు, ఇతర వివిధ రకాలైన పథకాలలో మ్యూచువల్ ఫండ్ సంస్థ పెట్టుబడులు పెడుతుంది. ప్రతి మ్యూచువల్ ఫండ్ సంస్థ అనేక రకాలైన మ్యూచువల్ ఫండ్లను నిర్వహిస్తుంది. ఒక్కో పథకం (స్కీం) అనుభవజ్ఞులైన మ్యూచువల్ ఫండ్ మేనేజర్ అధ్వర్యంలో నడుపుతారు. మ్యూచువల్ ఫండ్ మేనేజర్, నిపుణులైన అతని బంధం సమగ్ర పరిశోధన, విశ్లేషణలు చేసి ప్రజల నుంచి సేకరించిన నిధులను వివిధ కంపెనీల షేర్లలో పెడతాయి. ఫండ్ మేనేజర్ డబ్బును ఎలా పెట్టు బడి పెట్టాలో నిర్ణయిస్తాడు. ఉదాహరణకు మన వద్ద పది వేలున్నాయి. దాంతో తొమ్మిది టైటాన్ షేర్లు వస్తాయి. లేదా చెరో షేర్ చొప్పున రిలయన్స్(రూ.1180/), ఇన్ఫోసిస్ (రూ.775/) హిదూస్థాన్ యూనిలీవర్(రూ.1740/) రెడ్డీ ల్యాబ్స్ (రూ.2535/) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.2220/) ఏషియన్‌పెయింట్స్(రూ.1550/)కొనవచ్చును. ఒక్కో కంపెనీలో ఒక్క షేర్ కొనడం వలన అం తగా లాభదాయకం కాదు. అలాగే పది వేలుతో ఒకే కంపె నీ కి చెందిన షేర్లు కొన్నా రిస్క్ ఉండొచ్చును. అలాగే మారుతీ షేర్(రూ.5700/), జ్లెట్ బ్లేడు (రూ.7100/) ఎంఆర్ ఎఫ్ టైర్ (రూ.54280/) లాంటి కొన్ని కం పెనీల షేర్ల ధరలు మనకు అందుబాటులో ఉండకపోవొచ్చును.

అయితే అదే పదివేలు ఒక మ్యూచువల్ సంస్థలో మీ రిస్క్, వయసు, ఆదాయం కి తగ్గట్టుగా అనుకూలీ కరించిన స్కీం లో పెట్టుబడి పెట్టినయితే, మీరు కొన్న రోజు నాడు ఆ స్కీం యూనిట్ విలువ బట్టి మీకు మదుపుచేసిన మొత్తానికి యూనిట్లు కేటాయిస్తారు. కంపెనీ షేర్ ని ప్రత్యక్షంగా కొన్నట్టయితే మీకు షేర్ అనగా ఆ కంపెనీ లో వాటా ఉంటుంది. అదే పరోక్షంగా మ్యూచువల్ ఫండ్లలో పెడితే ఆ ఫండ్ మీకు యూనిట్లు కేటాయిస్తాయి. ఒక యూనిట్ విలువ మీరు కొనే స్కీం బట్టి ఉంటుంది. మీరు పెట్టుబడి పెట్టిన మ్యూచువల్ ఫండ్ స్కీం లో లక్షల మంది పెట్టుబడి పెడతారు. కొంతమంది 1000/నుండి 10000/ పెడితే మరికొందరు లక్షలు పెడతారు. ఇలా ప్రజల నుండి సేకరించిన మొత్తం కోట్లలో ఉంటుంది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు వారి నిర్వహణ వ్యయాన్ని తీసివేసి మిగిలిన ఆ మొత్తాన్ని 50 నుండి 100 కంపెనీల షేర్లు కొంటారు. ఆ మ్యూచువల్ ఫండ్ స్కీం కొన్న షేర్లు పుంజుకొంటే మీ యూనిట్ ధర అంతే మొత్తంతో పుంజుకొంటుంది. నష్టమొచ్చినా మీ యూనిట్ల విలువ తగ్గుతాయి. షేర్లు కొనుగోలు అమ్మ కాలు చేసినపుడు బ్రోకరేజీ, స్టాంప్ డ్యూటీ, ఇతర చార్జీలు విధిస్తారు. మ్యూచువల్ ఫండల్లో యూనిట్ల కొనుగోళ్లపై చార్జీలు విధించడం 2009 లో ఎత్తివేశారు. కొన్ని ఫండ్ల స్కీంలలో పెట్టుబడి పెట్టి యూనిట్లు అమ్మి నపుడు మాత్రం అమ్మగా వచ్చిన రుసుము మొత్తం పై 0.50 శాతం నుండి 3 శాతం చార్జీలు విధిస్తారు. ఏడాది లోపల అమ్మితే 2శాతం లేదా 3 శాతం విధిస్తారు. కంపెనీలు తమ వాటాలను ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ ద్వారా అమ్మినట్టే కొత్త మ్యూచువల్ స్కీం ప్రవేశపెట్టి నప్పుడు మ్యూచువల్ ఫండ్లు న్యూ ఫండ్ ఆఫర్ ద్వారా ప్రజల నుంచి పెట్టుబడులు సేకరిస్తాయి. ఒకస్కీం ప్రారం భించినపుడు మొదట్లో అన్ని మ్యూచువల్ ఫండ్ల యూ నిట్ల విలువ రూ. 10/ తోనే ప్రారంభమవుతుంది. అత్య ధిక మ్యూచువల్ ఫండ్ స్కీంలు సాధారణంగా "ఓపెన్ ఎండెడ్" గా ఉంటాయి, అంటే మదుపుదారులు ఎప్పుడైనా ఆ యొక్క ఫండ్ స్కీంలో పెట్టుబడి పెట్టి యూనిట్లు కొనవచ్చును. ఎప్పుడైనా యూనిట్లు అమ్ముకోవచ్చును. కొన్ని మ్యూచువల్ ఫండ్ల స్కీం లు "క్లోజుడ్ ఎండెడ్" గా ఉంటాయి. అనగా ఒక్క న్యూ ఫండ్ ఆఫర్ సమయంలో తప్ప తరువాత ఈ ఫండ్లలో యూనిట్ల క్రయ విక్రయాలు జరగవు. క్లోజుడ్ ఎండెడ్" స్కీం లకు మూడేళ్లు నుంచి ఐదేళ్ల వరకు లాకిన్ ఉంటుంది, లాకిన్ కాలంలో మనం కొన్న యూనిట్లు విక్రయించలేము.

వివిధ మ్యూచువల్ ఫండ్ స్కీం లు వాటి పెట్టుబడి ఉద్దేశ్యం బట్టి లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్లుగా వర్గీకరించవచ్చును. లార్జ్ క్యాప్ ఫండ్లు బ్లూ చిప్, అధిక మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న పెద్ద కంపెనీల షేర్లను కొనేవి లార్జ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు. మధ్యస్థ, తక్కువ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు లో షేర్లు కొని మదుపు చేసేవి మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్లు. ఒక కంపెనీ స్టాక్ మార్కెట్లో జారీ చేసిన షేర్ల సంఖ్య ను ఆ రోజు షేర్ ధరతో గుణిస్తే వచ్చే సంఖ్యే ఆ కంపెనీ యొక్క మార్కెట్ క్యాపిటలైజేషన్ లేక మార్కెట్ విలువ. కొన్ని ఫండ్ల స్కీం లు బ్యాంకింగ్, ఫార్మా, పవర్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, మీడియా వంటి ఒక ప్రత్యేక సెక్టర్ ని ఎంచుకొని ఆ రంగానికి సంబంధించిన షేర్లలోనే

పెట్టుబడి పెడతాయి, వాటిని సెక్టోరియల్ ఫండ్లంటారు. గ్లోబల్ ఫండ్లు విదేశీ కంపెనీల మ్యూచువల్ ఫండ్లు, షేర్లలో పెట్టుబడిపెడతాయి. మరి కొన్ని ఫండ్ల స్కీంలు షేర్లకు బదులు కేవలం ఇతర మ్యూచువల్ ఫండ్ల యూనిట్లు కొనుగోలుచేస్తాయి. వీటిని ఫండ్ ఆఫ్ ఫండ్స్ అంటారు. కొన్ని ఫండ్ స్కీం లు మూడేళ్లవరకు లాకిన్ ఉంటుంది, వీటిలో పెట్టిన పెట్టుబడి పై ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80సి కింద డిడక్షన్ లభిస్తుంది. వీటిని ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం అంటారు. సేకరించిన నిధులలో 60 శాతం ఈక్విటీ షేర్లలో, 40శాతం బాండ్లు డిపాజిట్లు లో పెట్టుబడి పెట్టేవి బ్యాల న్సుడ్ ఫండ్లు, వీటినే హైబ్రిడ్ ఫండ్లు అని కూడా అం టారు. ఈక్విటీ ఫండ్ల కన్నా వీటిలో రిస్క్, రాబడి తక్కువ. ఫిక్సడ్ ఇన్కమ్, గిల్ట్ ఫండ్, లిక్విడ్ ఫండ్, మంత్లీ ఇన్కమ్ ప్లాన్ వంటి స్కీంలను డెట్ ఫండ్లుగా వర్గీకరిస్తారు. సింహభాగం బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లుల్లో ఈ ఫండ్ స్కీం లు పెట్టుబడి పెడతాయి. రాబడి , రిస్క్ తక్కువ. ఇలా వివిధ పెట్టుబడి శైలులు, ప్రత్యేకతలు కలిగిన వేలాది రకాల మ్యూచువల్ ఫండ్ స్కీంలు ఉన్నాయి.

ప్రతి మ్యూచువల్ ఫండ్ స్కీం లో గ్రోత్, డివిడెండ్ రీఇన్వెస్ట్మెంట్, డివిడెండ్ పే అవుట్ అనే ఆప్షన్లు ఉంటాయి. కంపెనీలు షేర్లపై మ్యూచువల్ ఫండ్లకు ఇచ్చే డివిడెండ్ మొత్తాన్ని ఆయా స్కీం లలో యూనిట్లు ఉన్నవారికి పంచుతాయి. మీకు డివిడెండ్ డబ్బు రూపంలో కావాలంటే డివిడెండ్ పే అవుట్ ఆప్షన్ ఎన్నుకోవాలి. డివిడెండ్‌ని కూడా మదుపు చేయాలంటే గ్రోత్ ఆప్షన్ ఎన్నుకోవాలి, మీ యూనిట్ విలువ (ఎన్ ఏ వి) ఆ మొత్తంతో పెరుగుతుంది. డివిడెండ్ రీఇన్వెస్ట్మెంట్ ఎన్నుకొంటే డివిడెండ్ మొత్తంకి సమన విలువ గల మరి కొన్ని యూనిట్లు మీ ఖాతాలో పెరుగుతాయి. సంగ్రహంగా చెప్పాలంటే మ్యూచువల్ ఫండ్ల వలన సౌలభ్యత, సరళత, వైవిధ్యం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. స్టాక్ మార్కెట్ పై అవగాహన లేని వారు మ్యూ చువల్ ఫండ్ల ద్వారా పరోక్షంగా స్టాక్ మార్కెట్లో పెట్టు బడిపెట్టొచ్చును. కానీ తమ అవసరాలకు తగ్గట్టు సరియైన మ్యూచువల్ ఫండ్ స్కీం ఎంచు కొనే నైపుణ్యం ఉండాలి లేదంటే బ్యాంకు ఉద్యోగులు, బ్రోకర్లు, మ్యూచు వల్ ఫండ్ అనుభజ్ఞుల సహాయం పొందాలి.

పాఠకులు
తమ ప్రశ్నలను
Prabhamoney2019@gmail.com
కు పంపవచ్చు